క్లుప్తంగా

పెదకలవలాపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాంబిల్లి : పెదకలవలాపల్లిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ ధూళి నాగరాజు , ఎంపీపీ భర్త జి. శ్రీనుబాబు, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ కనకారావు, మాజీ సర్పంచ్ తాతబాబు తదితరులు వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ, సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు.

ఉమ్మలాడలో 'నేడు వై ఏపీ నీడ్స్' జగన్

మునగపాక : ఉమ్మలాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు సచివాలయ ప్రాంగణంలో ప్రభుత్వ సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే ఆవిష్కరణతో పాటు ఏఏ పథకాల ద్వారా ప్రజలకు మేలు జరిగిందనే విషయమై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఒంపోలులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని ఒంపోలులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలకు భరోసాగా ఈ పథకం దోహదపడుతుందన్నారు. సీజన్‌లో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి,సీహెచ్‌వో దేవకాంత పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయిన కిరణా దుకాణం

ఎస్.రాయవరం : సర్వసిద్ధి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం ఓ కిరణా షాపు దగ్ధమైంది. గ్రామానికి చెందిన సాకా సత్యనారాయణ దుకాణంలో షాపు తెరవక ముందు అగ్ని ప్రమాదం జరిగినట్టు చెప్పారు. ఈ ఘటనలో సుమారు లక్షా 50 వేల రూపాయలు విలువ చేసే సరకులు కాలి బూడిదయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వీఆర్‌వో రమణ ప్రమాద అంచనా వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టపోయిన కిరాణా వ్యాపారిని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అధికారులకు సూచించారు. మండలంలోని పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థను కాలనీ వాసులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అక్కడే ఉన్న గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ మొల్లేటి హైమ, పార్టీ నేతలు శివాజీ, సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాడు హామీలకు మంగళం..
భరోసా లేని యువగళం



గోకివాడ వద్ద ఆనకట్ట

- టీడీపీ హయాంలో యథేచ్ఛగా దోపిడీ
- ఒక్క హామీ కూడా నెరవేర్చని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే నియోజకవర్గంలో అభివృద్ధి

అచ్యుతాపురం(అనకాపల్లి) : గత టీడీపీ హయాంలో యలమంచిలి నియోజక వర్గాన్ని అధఃపాతాళానికి నెట్టిన నాటి ఎమ్మెల్యే ఇప్పుడు జిల్లాలో జనసేన పగ్గాలు చేపట్టి ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారు..? యువగళం పేరిట పాదయాత్ర చేస్తున్న లోకేష్ ఏం ముఖం పెట్టుకొని నియోజకవర్గంలోకి అడుగుపెడుతున్నారు..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాకమునుపు చంద్రబాబు సైతం చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని పచ్చపార్టీ యువనేత ఇప్పుడు యలమంచిలి నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పుడు తమ హయాంలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా? అని ప్రజలు అడుతున్నారు. గ్రావెల్ దోపిడీతో పాటు నాలుగు మండలాల్లో ఒక్కో ఇన్‌ఛార్జ్‌ని పెట్టుకున్న అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ హయాంలో నియోజక వర్గంలో ఏ మాత్రం అభివృద్ధి బాటలు వేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా యలమంచిలి రైల్వే గేటు తాను అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తానని చెప్పి గాలికొదిలేశారు. మళ్లీ గాలి మాటలు చెప్పి అధికారం కోసం పాదయాత్ర చేస్తున్న లోకేష్ మాటలు నమ్మే పరిస్థితిలో లేమని ప్రజలు అంటున్నారు.

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకూ రోడ్డు విస్తరణ జరగాల్సి ఉన్నప్పటికీ టీడీపీ హయాంలో హామీ నెరవేర్చలేదు. పూడిమడక మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ విషయంలో టీడీపీ హయాంలో పూర్తిగా న్యాయం జరగలేదు. పైగా ప్యాకేజీ లబ్ధిదారుల విషయంలో గోల్‌మాల్ జరిగింది. బార్క్‌కు భూముల సేకరించిన తంతడి పరిధిలోని భూములకు సంబంధించి పరిహారం ఇవ్వాలని భావించగా, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయి. ఈ సమస్య ఇప్పటికీ జఠిలంగానే ఉంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పుడు మునగపాక మండలంలోని లోతట్టు ప్రాంతాలైన చూచుకొండ, గణపర్తి గ్రామాలను 2012లో సంభవించిన నైలాన్ తుపాను బాధిత కుటుంబాలను ఓదార్చేందుకు వచ్చారు. నాడు తాను అధికారంలోకి వస్తే ముంపు ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి జీ ప్లస్ వన్ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని విస్మరించారు. అయిదేళ్ల కాలంలో ముంపు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

గొడారి ఆనకట్టకు నిధులిచ్చారా...!

2015లో అనకాపల్లి పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఉమ్మలాడ శారదానది వద్ద గొడారి ఆనకట్ట నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తన హయాంలో ఆనకట్ట జోలికి పోలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించడం పట్ల విమర్శలు గుప్పించారు. రాంబిల్లి మండలంలో గల గోకివాడ ఆనకట్ట పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు ఈ ఆనకట్ట పనులకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించినా అమలు జరగలేదు. యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో గల రాంబిల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో 12వేల ఎకరాల ఆయకట్టు భూములు ఈ గోకివాడ ఆనకట్ట పరిధిలో ఉన్నాయి.

నాడంతా అవినీతిమయం

అచ్యుతాపురం మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ని నియమించి అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు(టీడీపీ) మండల ఇన్‌ఛార్జ్(అనధికార వ్యక్తి) ద్వారానే ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేవారు. కొండకర్లను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ టీడీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. మునగపాక మండలంలో టీడీపీ హయాంలో జరిగిన అవినీతికి సంబంధించి 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాన్‌లో భాగంగా టీడీపీ నేతలు పరిహారం విషయంలో అవినీతి,అక్రమాలకు పాల్పడ్డారు. కొబ్బరి చెట్లు లేకుండానే పలువురు నేతలు అధికారులను ప్రసన్నం చేసుకొని కొబ్బరి చెట్లకు పరిహారం పొందారు. ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.వెయ్యి వంతున తప్పుడు మార్గంలో అవినీతికి పాల్పడ్డారు. మునగపాక శీలప్పన చెరువు అభివృద్ధి పేరుతో టీడీపీ నాయకులు రూ.3లక్షల మేర అవినీతికి పాల్పడ్డారు. నాడు మునగపాకలో సంతబయిల ములబంద గోడి ప్రాంతానికి వెళ్లే మార్గంలో రక్షణ గోడ పేరిట కాంట్రాక్టర్ నాసిరకం పనులు నిర్వహించి రూ.3లక్షలకు పైగా బిల్లులు చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

జగనన్న ప్రభుత్వం వచ్చాకే ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి

టీడీపీ హయాంలో ఫ్లై ఓవర్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.8.5 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేశారు. త్వరలోనే ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానుంది.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఫ్లై ఓవర్

కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీలో అందలం

- యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- నూతన మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకారం



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న యలమంచిలి మార్కెట్ కమిటీ కొత్త కార్యవర్గం సభ్యులు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, పార్టీ ప్రజా ప్రతినిధులు

యలమంచిలి : రాజకీయాల్లో కృషి, పట్టుదల ఉంటే పదవులు వాటంతట అవే మనల్ని వెతుక్కుంటూ వస్తాయని ఎమ్మెల్యే యు.వి రమణ మూర్తిరాజు (కన్నబాబు)అన్నారు. బుధవారం పట్టణంలో గుర్రప్ప కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే సమక్షంలో యలమంచిలి కొత్త మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ పెదపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, వైస్ చైర్మన్‌గా వెల్పూరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, రాంబిల్లి కోఆపరేటివ్ డైరెక్టర్‌గా పని చేసిన సిరిదిల్ల శ్రీనివాసరావును, కమిటీ సభ్యులు మళ్ల మల్లేశ్వరి, బొడ్డేడ చెల్లయ్యనాయుడు, సున్నం నాగేశ్వరరావు, సమ్మంగి అప్పలకొండ, షేక్ మహబూబ్ మున్నీసా, మట్టా కుమారి, కంటే నాగలక్ష్మి, దువ్వాడ జయలక్ష్మి, మడక గోపి సుశీల, తోట వెంకటేశ్వరరావు, లింగంపల్లి శ్రీనివాసరావు, మైలపల్లి బంగారుశెట్టి, బండారు అనురాధ, జంపన అచ్చుతరామరాజులను నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా శాలువ కప్పి పుష్పగుచ్ఛాలుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కష్టపడ్డ కార్యకర్తలకు ఎప్పటికీ గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తలే మూలం అని ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి మరలా సీఎం కాబోతున్నారని, యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి 40 వేల మెజారిటీ ఖాయమని అన్నారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే ఏ నాయకుడికైనా ప్రజా మద్దతు ఉంటుందని రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎం చేయడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని అన్నారు. పార్టీ అధికారంలో ఉంటేనే కార్యకర్తకైనా ప్రజాప్రతినిధికైనా గౌరవం లభిస్తుందని ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు బోదెపు గోవింద్, కోన సంధ్య లచ్చన్నాయుడు, మళ్ల జయలక్ష్మి, గొట్టిముక్కల శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీలు, సేనాపతి సంధ్యారాణి రాము, ధూళినాగరాజు, పెంటకోట స్వామి సత్యనారాయణ, నర్మాల కుమార్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాథ్, ఆడారి అచ్చియ్యనాయుడు, పిన్నమరాజు రాధా సుందర సుబ్బరాజు,(కిశోర్‌రాజు), మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, వైస్ ఎంపీపీలు రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్(చిన్నా), కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, రూరల్ సచివాలయ కన్వీనర్ వీసం వాసు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం



సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల సత్యవరం గ్రామంలో వున్న రెండో సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి... అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వృద్ధులకు పింఛన్లు, ఆసరా, చేయూత, అమ్మ ఒడి, సున్నా వడ్డీ, రైతు భరోసా, ఇళ్లు లేని వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి రుణ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, విద్యార్థులకు పౌష్టికాహారం సరఫరా, పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువు, విద్యాకానుక వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నేరవేర్చలేకపోయరన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేశారన్నారు. యథా ప్రకారం సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా మనందరం జగన్ మోహన్‌రెడ్డినే ఆశీర్వదించి, పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేసిన 18 కోట్లు రూపాయలు నిధుల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీటీసీ యగడాసు శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, గ్రామ శాఖ అధ్యక్షుడు గూటూరు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, ఎంపీడీవో సాంబశివరావు, ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సువర్ణపాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం



పల్లపు ఆనందపురంలో ప్రభుత్వ పథకాల లబ్ధి డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: ప్రజలకు సువర్ణపాలన కావాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి సీఎంగా మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) కోరారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లేను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అలాగే గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్య నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కర్రి అప్పయమ్మ, ఎంపీటీసీ కర్రి సంజీవి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,సచివాలయాల మండల కన్వీనర్ గణేష్,వైఎస్సార్‌సీపీ నేతలు రమణబాబు, భాస్కరరావు, పిల్లి అప్పారావు, బొద్దపు శ్రీరామమూర్తి, పెదబ్బాయి, చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు పాల్గొన్నారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆవిష్కరించారు.

లబ్ధిదారులే మాకు ఓటు బ్యాంకు...

- జగనన్న పథకాలే మాకు శ్రీరామరక్ష
- ఎమ్మెల్యే బాబూరావు



ఉపమాకలో పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం ఉపమాకలో మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులే మాకు ఓటు బ్యాంకు అన్నారు. పార్టీల కతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చే పథకాలు అమలు చేసారన్నారు. లబ్ధిపొందిన వారంతా మళ్లీ జగనన్న పాలన కావాలని కోరుకుటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ రద్దు చేస్తారన్నారు. సంక్షేమ పథకాలు కావాలో.. టీడీపీ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రి, ఇంటింటికీ కుళాయిలు, మారుమూల గ్రామాలకు రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజల్లోకి వెళ్లి తాము చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెప్పుకుంటున్నామన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీటీసీలు కొల్నాటి బుజ్జి, దేముళ్లు, లొడగల చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి, పార్టీ సీనియర్ నాయకులు మనబాల తాతారావు, జేసీఎస్ కన్వీనర్ వియ్యపుశ్రీను, రవి, కొప్పిశెట్టి రమణ గరగ సూరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము పంపిణీ



వైఎస్ఆర్ బీమా సొమ్మును పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మోసయ్యపేటకు చెందిన మచ్చు రమణమ్మ మృతి చెందడంతో ఆమె నామినీ నూకాలమ్మ వైఎస్ఆర్ బీమా సొమ్మును సర్పంచ్ పంచదార్ల పైడిరాజు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేల్ఫేర్ అసిస్టెంట్ రాము, వీఆర్ఓ అప్పారావు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమంలో సినీ హీరో వెంకటేష్ జన్మదిన వేడుకలు



దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసిన దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దివ్యాంగుల ఆశ్రమంలో బుధవారం సినీ హీరో వెంకటేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో వెంకటేష్ అభిమానులు కేక్ కట్ చేసి పంచారు. 80 మంది విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు పట్నాయక్, చందు, ధర్మిరెడ్డి రాము, గండిబోని రాజు, వెంకటేష్ అభిమానులు పాల్గొన్నారు.

చురుగ్గా జంగిల్ క్లియరెన్సు

కోటవురట్ల : రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారుల్లో జంగిల్ క్లియరెన్సు నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా రహదారుల్లో భారీగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మలుపుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా యి. స్పందించిన అధికారులు నివారణ చర్య లు తీసుకున్నారు. ప్రస్తుతం నర్సీపట్నం–రేవుపోలవరం రహదారిలో జంగిల్ క్లియరెన్సు చేస్తున్నారు. యండపల్లి నుంచి రామచంద్రపురం వరకు పనులు జరుగుతున్నాయి. దాంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన చలి తీవ్రత

రాంబిల్లి : చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగిపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వెచ్చదనం కోసం మంటలు వేసుకుంటున్నారు. రాత్రి ఏడు గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. చలి గాలుల కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవా లని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ సూచించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నేను లింగంపల్లి హరి మహేశ్వరరావు, S/o. లేటు కృష్ణ మూర్తి R/o. H.No. 25-210, భవనం వీధి, యలమంచిలి - 531 055, ఇందు మూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునదేమనగా, నేను బస్సులో ప్రయాణిస్తుండగా నా బ్యాగ్ పోయిందని గమనించాను. అందులో నా వెండర్ - శ్రీమంతుల భానుకి అనుకూలంగా సేల్-డీడ్ (లింక్ డాక్యుమెంట్) డాక్యుమెంట్ నెం. 3047/1999ని కూడా పోయింది. ఈ మేరకు ఎలమంచిలి స్టేషన్ హౌస్ అధికారికి ఫిర్యాదు నం. MLD012300382310 కూడా అందింది. దానిపై పూర్తి స్థాయి విచారణను సంబంధిత పోలీసులు నిర్వహించగా, దానిని గుర్తించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆచూకీ లభించలేదని నివేదించారు. పరిస్థితుల దృష్ట్యా అటువంటి పత్రం కనుగొనబడినట్లయితే, దానిని ఈ దిగువ పేర్కొన్న నా చిరునామాకు అందజేయవలసిందిగా నేను ప్రజలందరినీ అభ్యర్థిస్తున్నాను.

లింగంపల్లి హరి మహేశ్వర రావు, S/o. లేటు కృష్ణ మూర్తి, R/o. H.No. 25-210, భవనం వీధి, యలమంచిలి - 531 055, సెల్ నెం. 9948563850.

17న ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామీణ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాము

మునగపాక : ఈ నెల 17న మునగపాకలో నందీశ్వర ప్రాంగణంలో ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన జరుగుతుందని గ్రామీణ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి రాము తెలిపారు. నాటకరంగ దర్శకుడు స్వర్గీయ మొతికా సాంబశివరావు సంస్మరణ సందర్భంగా కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. రాము మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, రంగ స్థల దర్శకునిగా సాంబశివరావు ఎంతోమందిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన జ్ఞాపకార్థం 17వ తేదీ రాత్రి 7.30 గంటలకు ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నాటకానికి రచన స్క్రిప్ట్ అందించగా ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహిస్తారన్నారు. నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. నందీశ్వర నాట్యమండలి, గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పెద్దలు మళ్ల కృష్ణ, ఆడారి సోమశేఖర్, మళ్ల రామ జోగినాయుడు, ఆడారి మహేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వెండి కవచం, చీర అలంకరణ

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామికి వెండికవచం, శ్రీలక్ష్మీ అండాళ్ అమ్మవారికి వెండిచీర అలంకరణ బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, అగ్నిప్రతిష్ఠ, మృత్యుంగ్రహణం, దీక్షధారణ, హోమం భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ స్వామివారిని దర్శించుకుని హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆయన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డపాటి చినరాజారావు, కటారి దేముడు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలు.. దానధర్మాలు

కార్తీకమాస అమావాస్య మర్నాడు, మార్గశిర పాడ్యమి పోలిస్వర్గంను పురస్కరించుకుని స్థానిక శారదానదిలో పుణ్యస్నానాలకు మహిళా భక్తులు భారీగా తరలివచ్చారు.

జోరుగా వరికోతలు



జల్లూరులో వరి చేను కోస్తున్న రైతులు

కోటవురట్ల: అన్నదాత మిచాంగ్ చేసిన గాయం నుంచి కోలుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రస్తుతం రైతులు పొలాల్లో బిజీగా ఉన్నారు. గింజ రాలిపోయే పరిస్థితి రావడంతో గత్యంతరం లేక రైతులు వరి చేలను కోస్తున్నారు. ఆరుదల పెట్టిన చోట వరి పనలను నూరుస్తున్నారు. మిగిలిన గింజలనైనా దక్కించుకోవాలనే తపనతో పనులు ముమ్మరం చేశారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో 1650 హెక్టార్లలో వరి సాగు జరిగింది. కోతలు చేపట్టే దశలో తుపాను రావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడంతో రైతులు ధైర్యంగా ఉన్నారు. నష్టం బీభత్సం నుంచి ప్రభుత్వ సహకారంతో తేరుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం వాటిల్లకుండా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో తుపాను నష్టాన్ని ఉదార స్వభావంతో నమోదు చేస్తున్నారు. మండలంలో 1100 హెక్టార్లలో నష్టం జరిగినట్టు వ్యవసాయాధికారులు నివేదిక అందజేశారు.